క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులో ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం నిజశ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా సుదర్శన సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్, మధుసూదన్‌రావు, శ్రీనివాస్, కృష్ణమోహన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ మూడోసారి ఎమ్మెల్యే టికెట్ ప్రకటించినందున బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి పట్టణ శాఖ అధ్యక్షుడు తిరుమని యాదగిరి, ముదురుపాక రాములు, పోతరాజు దేవకుమార్, కరుణాకర్, కిరణ్, కృష్ణప్రసాద్, రవి పాల్గొన్నారు.

లచ్చయ్య మృతదేహానికి నివాళి

అర్వపల్లి: తిమ్మాపురం గ్రామానికి చెందిన తొండల లచ్చయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహానికి బుధవారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాగు విధానంపై అవగాహన

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల కేంద్రంలో బుధవారం సికింద్రాబాద్ లయోలా వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో వ్యవసాయ సాగు విధానం, సమస్యల పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా, భౌగోళిక ప్రాంతం, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చార్ట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, నరేష్, ఆదర్శ్, సర్పంచ్ జూలకంటి సుధాకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ


అల్పాహారం పంపిణీ చేస్తున్న నాయకులు

సూర్యాపేట: మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్ఫూర్తితో సూర్యాపేట పట్టణంలో రెండు నెలలుగా ఏరియా ఆస్పత్రి, కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద ప్రతిరోజూ అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. బుధవారం గండూరి రామస్వామి– జానకమ్మ, గండూరి సత్యనారాయణ జోనాల జ్ఞాపకార్థం బాటసారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఎడవెల్లి రమేష్, జూలకంటి నాగరాజు, తెరటిపల్లి సతీష్, బెజగం ఫణి, తేలుకుంట్ల వెంకన్న, కస్తూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న రాజీవ్‌సాగర్

తుంగతుర్తి: మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినికి టి.గౌతమికి ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీటు వచ్చింది. ఫీజు కట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ బుధవారం హైదరాబాద్‌లో విద్యార్థినికి ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థిని చదువు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నవీన్‌కు సన్మానం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడేనికి చెందిన బండారి బంగారి కుమారుడు నవీన్ ఇటీవల విడుదలైన యూజీసీ నెట్ 2023 ఫలితాల్లో తెలుగు విభాగంలో రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్)కు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా బుధవారం గ్రామంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ నవీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కుంభం నాగరాజు, కొప్పుల సోమిరెడ్డి, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, పెద్ది శ్రీను, కుంభం నాగరాజు, యాదయ్య, మార్కెట్ డైరెక్టర్ వెంకన్న, లొండిగ నాగరాజు, ఖాజా పాల్గొన్నారు.

కొత్తగా 408 దరఖాస్తులు

- అర్వపల్లిలో నూతన ఓటర్ల నమోదుకు విశేష స్పందన
- వచ్చే నెల 2, 3 తేదీల్లో మరో విడత శిబిరాల ఏర్పాటు


అర్వపల్లిలో ఓటరు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌ఓ

అర్వపల్లి: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. 18ఏళ్లు నిండిన వారు, అదేవిధంగా అక్టోబర్ 1 నాటికి 18ఏళ్లు నిండే వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఓటు కార్డులో సవరణలు, చనిపోయినవారి పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించారు. మండల వ్యాప్తంగా ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించారు.

32 పోలింగ్ కేంద్రాల్లోని..

జాజిరెడ్డిగూడెం మండలంలో 32 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 26, 27 తేదీల్లో రెండు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఓటు హక్కు నమోదు కోసం 408 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా వచ్చే నెల 2, 3 తేదీల్లో కూడా ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 22,222 మంది ఓటర్లు ఉన్నారు.

దరఖాస్తు చేసుకున్నా..



18 ఏళ్లు నిండటంతో కొత్తగా ఓటుహక్కు కోసం ప్రత్యేక శిబిరంలో దరఖాస్తు చేసుకున్నా. ఓటు నమోదుకు శిబిరాలు నిర్వహించడం బాగుంది. 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలి. – నజీర్, అర్వపల్లి

2, 3వ తేదీల్లో మరో విడత శిబిరాలు



ప్రస్తుతం 18ఏళ్లు నిండిన, అక్టోబర్ 1నాటికి 18ఏళ్లు నిండే వారు కూడా కొత్తగా ఓటు హక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే నెల 2,3వ తేదీల్లో తిరిగి ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తాం.

– జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్, జాజిరెడ్డిగూడెం మండలం

ప్రజాపోరాటాల్లో భిక్షం పాత్ర మరువలేనిది


భిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ప్రజా పోరాటాల్లో కొంగలి భిక్షం పాత్ర మరువలేనిదని రైతుకూలీ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య, అడ్వకేట్ వెంకట్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ మండల పరిధిలోని ఇస్తాళపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జనశక్తి నాయకుడు కొంగలి భిక్షం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుకూలీ సంఘం కార్యకర్తగా విప్లవోద్యమంలో పనిచేసి భూపోరాటాల్లో, ఇళ్ల స్థలాల స్వాధీనంలో, కూలీరేట్ల పెంపులో ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రైతుకూలీ పోరాట సమితి నాయకులు గురువయ్య, కృష్ణయ్య, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర నాయకులు బెల్లి నాగరాజు, పల్లెబోయిన జానీ, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర నాయకుడు సుధాకర్, సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ వర్గం నాయకులు బుద్ధ సత్యనారాయణ, లింగమల్లు, బయ్య వెంకన్న, న్యూడెమోక్రసీ నాయకులు దాసరి శ్రీను, ఎర్ర ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్: శ్రీచైతన్య విద్యాసంస్థలకు సీఎం కేసీఆర్ కొమ్ము కాస్తున్నారని, ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న కరీంనగర్ డీఈఓ, హుజూరాబాద్ ఎంఈఓలను సస్పెండ్ చేయాలన్నారు. సంఘం నాయకులు సింహాద్రి, గోపి, కిషోర్, హర్షిత్, చరణ్‌తేజ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న పాలిశెట్టి యాదగిరిరావు

తిరుమలగిరి (తుంగతుర్తి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరిరావు పిలుపునిచ్చారు. బుధవారం తిరుమలగిరిలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా నిత్యవసరాల సరుకుల ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రూ.2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో ఉద్యోగాలు కల్పించకపోగా పరిశ్రమలను మూసి వేస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపు చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉప్పలయ్య, లక్ష్మి, లింగయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తప్పుడు మాటలు నమ్మొద్దు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు సంబంధం లేని విషయాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాదరి కిశోర్‌కుమార్‌ను ప్రకటించినందున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సెప్టెంబర్– 1న తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ నాయకులు దొంగరి శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రమేష్, దాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చివ్వెంల(సూర్యాపేట): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద వచ్చే నెల 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం చివ్వెంల మండల కేంద్రంలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, వీరారెడ్డి, సైదా, నర్సిరెడ్డి, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 1న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ నాయకులు ఎస్.సోమయ్య, సీహెచ్.సోమయ్య కోరారు. బుధవారం వారు తిరుమలగిరిలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చే పీఆర్‌సీ బకాయిలు, ఏరియర్స్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నరేష్, మారయ్య, అంజయ్య, అజయ్‌కుమార్, సైదులు, రవిబాబు, హుస్సేన్, ఎల్లయ్య, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ మణి

నాగారం: ప్రతిఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. బుధవారం నాగారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం అండర్–14, 17 విభాగాల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ బాలునాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్లు నవనీత, మల్లేష్, హెచ్‌ఎం వెంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

తిరుమలగిరి (తుంగతుర్తి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని తిరుమలగిరి ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని జలాల్‌పురంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శాంతయ్య, మల్లికార్జున సంస్థ దేవాలయ చైర్మన్ సత్యం, ప్రధానోపాధ్యాయుడు అశోక్, బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత

పౌరహక్కులను కాపాడుకోవాలి


అర్వపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్


ఆత్మకూర్: గట్టికల్ గ్రామంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ పుష్ప

సూర్యాపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం సూర్యాపేట మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్‌లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ ముదిరెడ్డి చంద్రకళ, ఎంపీటీసీ ముదిరెడ్డి ఉజ్వలరెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి: పౌరహక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో బుధవారం జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమాజంలో కుల, మత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, జూనియర్ అసిస్టెంట్ పాష పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన అన్ని హక్కులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పుష్ప కోరారు. బుధవారం ఆత్మకూర్ మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. దళిత, బహుజనులు అన్నిరంగాల్లోనూ రాణించేందుకు భారత ప్రభుత్వం రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించిందని, వీటిపై ఆయా వర్గాలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే తమ హక్కులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎస్‌ఐ వెంకటరెడ్డి, సర్పంచ్ పూలమ్మ, ఆర్‌ఐ అంజయ్య, స్థానికులు సాయికుమార్, నర్సయ్య, పరమేష్ పాల్గొన్నారు.

మద్దిరాల: సమాజంపై పౌరులు గౌరవం కలిగి ఉండాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మద్దిరాల మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, సర్పంచ్ బొబ్బిలి నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి తేజ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

నూతనకల్: అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సహాయ ఎన్నికల నమోదు అధికారి తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. బుధవారం నూతనకల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం–ఓటర్ల నమోదు ప్రక్రియలో అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మద్దిరాల: మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఉన్న పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ అమీన్‌సింగ్ బుధవారం పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

తుంగతుర్తి : మండల కేంద్రంలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్ల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్‌కేవీ మండల ఉపాధ్యక్షుడు గడ్డం సోమేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు బొంకూరి శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

అర్వపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, నాగరాజు, భవిత్, ఆల్దాస్ లింగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

మద్దిరాల: కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను తనకు కేటాయించాలని బర్పటి మహేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపిస్తానని పేర్కొన్నారు.

బూత్‌లెవల్ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలి

తుంగతుర్తి : రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ వీరబ్రహ్మాచారి అన్నారు. ఇటీవల ప్రకటించిన ఓటరు జాబితాపై బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల– 21న ప్రచురించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్–19లోగా తెలపాలన్నారు. వాటిని పరిశీలించి అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్–2, 3 తేదీల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


అర్వపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సారథి కళాకారులు


తిరుమలగిరిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

అర్వపల్లి: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు 30 శాతం పీఆర్‌సీ పెంచడాన్ని హర్షిస్తూ బుధవారం అర్వపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీష్‌రెడ్డి, సారథి చైర్మన్ బాలకిషన్, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, సారథి డైరెక్టర్ హరికృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సారథి కళాకారుల జిల్లా అధ్యక్షుడు వేముల నరేష్, మేడిపల్లి వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులు మాగి శంకర్, గడ్డం ఉదయ్, ఈర్ల సైదులు, గంట భిక్షపతి, పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాములు, డప్పు సుధాకర్, ఉపేందర్, మంజుల, నాగలక్ష్మి, రాధ, ప్రియదర్శిని, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి): సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ జీఓ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జగదీష్‌రెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చిత్రపటాలకు కళాకారులు బుధవారం తిరుమలగిరిలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాలకుర్తి శ్రీకాంత్ గౌడ్, గడ్డం ఉదయ్, మల్లెల రాము, డప్పు సుధాకర్, పాక ఉపేందర్, నరేందర్, మంజుల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్టు


పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్ ఎదుట బీఎస్పీ నాయకులు

పెన్‌పహాడ్: మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలోని వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలకు వెళ్తుండగా ముందస్తుగా అరెస్టు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షులు బీంపంగి నాగరాజు, మండల ఇన్‌చార్జ్ రణపంగ శ్రవణ్‌పూలే, కొండమీది బుచ్చిరాములు, పాల్వాయి గణేష్, మామిడి మహేష్, మధు, మహేష్, ప్రసాద్, వేణు, ప్రమోద్, నవీన్, గోపి, మధు, నిఖిల్, జీవన్ తదితరులున్నారు.

అర్వపల్లి: చలో సూర్యాపేట నేపథ్యంలో బీఎస్పీ నాయకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్, జిల్లా నాయకుడు దాసరి శ్రీనివాస్, జీడి సరోజ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి): వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మల్లెపాక కృష్ణను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టె జానయ్యపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


పెన్‌పహాడ్: రాఖీ కడుతున్న చిన్నారులు


నూతనకల్: నాగార్జున పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థినులు


అర్వపల్లి: కోడూరు యూపీఎస్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు


తిరుమలగిరి కృష్ణవేణి పాఠశాలలో

పెన్‌పహాడ్: మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని శ్రీ అరబిందో మాత ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్వపల్లి: సోదర భావానికి ప్రతీక రాఖీ అని కోడూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. కోడూరు యూపీఎస్‌లో బుధవారం రాఖీ వేడుకలను నిర్వహించారు.

తిరుమలగిరి (తుంగతుర్తి): మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకొని శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో..

తిరుమలగిరిలో రాష్ట్రీయ స్వయం సేవా సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్, సుధాకర్, వెంకటేశ్వర్లు, సుభాష్‌రెడ్డి, సోమయ్య, మహేష్ పాల్గొన్నారు.

బిందులతకు మోటివేషన్ శిక్షణ ప్రశంసాపత్రం

నాగారం: మండల పరిధిలోని నాగారంబంగ్లా విజయనగర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బిందులత ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మోటివేషన్ శిక్షణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం నల్లగొండలో లయన్స్ మల్టిపుల్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. స్థానికంగా ఆమె మాట్లాడుతూ మోటివేషన్ ట్రైనర్‌గా విద్యార్థులను ఉత్తమమార్గంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధి నూనె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపురి గ్రామ ఎన్‌ఎస్‌యూఐ కమిటీ ఎన్నిక

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువజన, ఎన్‌ఎస్‌యూఐ గ్రామ కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా మెడిద శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షుడిగా సందీప్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గుండెపురి ఎంపీటీసీ సభ్యుడు దరావత్ జుమ్మిలాల్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, బాలకృష్ణ, శ్రీను యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.